క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులు పాటించాలి



ఊసుగుంటపాళెంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి

కోట: వరి పంట సాగు చేస్తున్న రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్‌రావు తెలిపారు. గురువారం మండలంలోని గూడలి, ఊసుగుంటపాళెం రైతు సేవా కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. వరిపంటను ఆశిస్తున్న తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులు వివరించారు. రైతులు రసాయన ఎరువుల వినియోగానికి ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయకుండా సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపాలన్నారు. కౌలు రైతులకు పంటసాగు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు ధనుంజయరెడ్డి, సుచేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

దక్కిలి: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాలని జై భారత్ రాష్ట్ర ఎస్సీ పోరాట వేదిక కార్యదర్శి తలారి నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని శ్రీపురం దళితవాడలో పర్యావరణంపై సామాజిక బాధ్యతగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నియంత్రించే విధంగా జీవన శైలిని మార్చుకోవాలని తెలియజేశారు. ప్లాస్టిక్‌ను నిర్మూలిస్తే పర్యావరణాన్ని పరిరక్షించుకోగలమన్నారు. అనంతరం జై భారత్ గుడ్డ సంచులను ఉచితంగా అందజేశారు.

పాఠశాలల్లో శిక్షా సప్తాహ్



జేపీపురంలో వివిధ వేషధారణల్లో చిన్నారులు

రాపూరు: మండలంలోని పలు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం సాంస్కృతిక దినోత్సవం వేడుకలను నిర్వహించినట్లు ఎంఈఓ జిలానీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని చిన్నారులకు వివరించడమే కాకుండా వేషభాషలపై అవగాహన కల్పించామన్నారు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాల సంస్కృతులను, సంగీత సాహిత్యాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

గూడూరు రూరల్: చెన్నూరులో ఉన్న ఎంపీయూపీ పాఠశాలలో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివజ్యోతి ఈ సందర్భంగా పిల్లలతో మాట్లాడుతూ కిషోర బాలికలు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లను తెలుసుకుని ఉండాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేసుకుంటే భవిష్యత్తులో పలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే స్థానికంగా ఉండే అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు. బాలికలకు అత్యవసర సమయాల్లో 1098కి ఫోన్ చేసి విషయం తెలియజేస్తే ప్రభుత్వం ద్వారా రక్షణ కల్పిస్తామన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

బైక్ బోల్తా పడి యువకుడికి గాయాలు

దొరవారిసత్రం: వీఎస్‌ఆర్ నగర్ గ్రామ సమీపంలో రహదారిపై ప్రమాదవశాత్తు బైక్ బోల్తాకొట్టిన ప్రమాదంలో బుడ్డతొట్టి వాసు(20) తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... బూదూరు గ్రామానికి చెందిన వాసు సూళ్లూరుపేటకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో బైక్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో వాసు గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న టోల్ ప్లాజా అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి గురైన కారు లభ్యం



నాయుడుపేటటౌన్ : నాయుడుపేట పట్టణంలోని కారు మెకానిక్ షెడ్డులో చోరీకి గురైన కారు వెంకటాచలం టోల్ ప్లాజా సమీపంలో లభ్యమైనట్లు మెకానిక్ మల్లారెడ్డి గురువారం తెలిపారు. టోల్‌ప్లాజా సమీపంలో వదిలి వెళ్లిపోయి ఉండడాన్ని గుర్తించి అక్కడి నుంచి కారు తెచ్చుకున్నట్లు వివరించారు. కారు దొరకడంతో మెకానిక్ ఊపిరి పీల్చుకున్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

కలువాయి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఈ ఏడాది మార్చి ఆఖరు వరకు ఉపాధి హామీ పథకం పనులు, నిధులపై గ్రామాల్లో ఈ నెల 16 నుండి 25వ తేదీ వరకు సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీ నిర్వహించాయని, శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక జరుగుతుందని వివరించారు.

హైవే నిర్మాణానికి మోక్షం కల్పించండి

- కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ గురుమూర్తి



నాయుడుపేట పట్టణ పరిధిలోని గోమతి సర్కిల్ వద్ద జాతీయ రహదారి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణ పరిధిలోని గోమతి సర్కిల్ నుంచి తుమ్మూరు వరకు ఉన్న 71వ నంబరు జాతీయ రహదారి వెళుతోంది. దీనిగుండా ప్రతి నిత్యమూ వందలాది వాహనాలు వెళుతూ ఉంటాయి. ఇక్కడ రహదారి చిన్నదిగా ఉండడంతోపాటు ఇరువైపులా ఆక్రమణలు పెరగడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. రోడ్డు విస్తరణ ఎంతో అవసరం ఉంది. దీనిపై గతంలో తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రత్యేక చొరవ తీసుకుని ఎన్‌హెచ్ అధికారులతో కలిసి సుమారు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. అంతేకాకుండా ఈ నెల 17వ తేదీ తిరుపతికి వచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి జాతీయ రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్

నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న మలుపు వద్ద చాంద్రాయి చెరువు కాలువపై ఉన్న వంతెన, తమ్మూరు గ్రామ సమీపంలో పాత చెక్‌పోస్టు వద్ద అన్నమేడు పంట కాలువపై ఉన్న వంతెన చాలా చిన్నవిగా ఉన్నాయి. పెద్ద వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఈ సమస్యను ఉన్నతాధికారులకు నివేదించడంతో రెండేళ్ల క్రితం సుమారు రూ.1.60 కోట్లతో రెండు చోట్ల వంతెన పనులు పూర్తి చేసి జాతీయ రహదారిని వెడల్పు చేశారు. అదే విధంగా గోమతి సర్కిల్ నుంచి తుమ్మూరు వరకు రహదారి విస్తరణ చేపట్టాల్సి ఉంది. ఇందులో భాగంగా రెండేళ్ల కిందటే ఎన్‌హెచ్ అధికారులు చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిని ఇరువైపులా ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు సైతం జారీ చేశారు. తర్వాత పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే ఈ రోడ్డును వదిలేసి గోమతి సర్కిల్ నుంచి తాళ్వాయిపాడు గ్రామం వైపు ఎల్‌ఏ సాగరం మీదుగా నాయుడుపేట పట్టణ పరిధిలో ఉన్న 16వ జాతీయ రహదారికి అనుసంధానం చేశారు. పనులు ఇంకా జరుగుతున్నాయి. పట్టణ పరిధిలో ఉన్న గోమతి సర్కిల్ నుంచి తుమ్మూరు వరకు ఉన్న 71వ నంబరు జాతీయ రహదారి పనులు చేపడితే పట్టణ ప్రజలకు అనుకూలంగా ఉంటుందని, పట్టణం కూడా విస్తరించే అవకాశం ఉంటుందని ఎంపీ గురుమూర్తి కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఇందులో భాగంగా ప్రతిపాదనలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు చేపట్టాలి



నాయుడుపేట పట్టణ పరిధిలో ఉన్న గోమతి సర్కిల్ నుంచి తుమ్మూరు వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు చేట్టాలి. రహదారి విస్తరణ పనులు జరిగితే పట్టణ ప్రజలకు చాలా సౌకర్యంగా ఉంటుంది. వాహనాలు కూడా సాఫీగా వెళతాయి. ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

– భాస్కర్ రెడ్డి, నాయుడుపేట

గతంలోనే ప్రతిపాదనలు పంపించాం

నాయుడుపేట పట్టణ పరిధిలోని గోమతి సర్కిల్ నుంచి తుమ్మూరు వరకు ఉన్న 71వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు చేసేందుకు గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతోపాటు అనుమతులు ఇచ్చిన వెంటనే పనులు చేపడతాం.

– సత్యమూర్తి, ఎన్‌హెచ్ డీఈ





ఆర్టీసీ బస్టాండు సమీపంలో వెడల్పుగా ఉన్న వంతెన, నాయుడుపేట పట్టణంలో ఆక్రమణలతో కుంచించుకుని పోయిన రహదారి

రూ.56 లక్షలతో గురుకులంలో అభివృద్ధి



గురుకులం వద్ద వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపల్ దాదాపీర్

నాయుడుపేట టౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో రూ.56 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ప్రిన్సిపల్ దాదాపీర్ గురువారం తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పించేందుకు రూ.56 లక్షల నిధులతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో రూ.25 లక్షలు ఏపీఎస్‌డబ్ల్యూఎస్ సొసైటీ నుంచి మంజూరైనట్లు తెలిపారు. మిగిలిన రూ.31 లక్షలు జిల్లా కలెక్టర్ గ్రాంటు నుంచి విడుదల చేశారన్నారు. ఈ నిధులతో డార్మిటరీ, మరుగుదొడ్లను మరమ్మతు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి గురుకులంలో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

29 నుంచి తరగతులు ప్రారంభం

గురుకుల పాఠశాలలో ఈ నెల 29వ తేదీ నుంచి ఇంటర్‌మీడియట్, 10వ తరగతి విద్యార్థులకు తరగతులను ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు ప్రిన్సిపల్ దాదాపీర్ తెలిపారు. గురుకులంలో పూర్తి స్థాయిలో పనులు జరిగిన తరువాత 5వ తరగతి నుంచి 9 వరకు విద్యార్థులకు కూడా తరగతులను ప్రాంభించేలా చర్యలు చేపడుతామన్నారు.

బడిలోకి బిహారీ పిల్లలు



బడిలో చేరిన బిహారీ పిల్లలు, తల్లిదండ్రులతో విద్యాశాఖాధికారులు

చిల్లకూరు: పొట్టకూటి కోసం పరిశ్రమల్లో పని చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పిల్లలు బడికి వెళ్లకుండా వీధుల్లో తిరుగుతూ భిక్షాటనకు అలవాటు పడుతున్నారు. అలాంటి పిల్లలను గుర్తించిన విద్యాశాఖాధికారులు తల్లిదండ్రులతో మాట్లాడి వారిని గురువారం బడిలో చేర్పించారు. ఈ క్రమంలోనే మండలంలోని తిమ్మనగారిపాళెం గ్రామంలో అల్లాయిస్ పరిశ్రమలో పని చేసేందుకు 15 కుటుంబాల వారు బిహార్ ప్రాంతం నుంచి వలస వచ్చి ఇక్కడ ఉంటున్నారు. ఈ 15 కుటుంబాలలో బడి ఈడు పిల్లలు 20 మంది ఉన్నారు. వీరంతా బడికి దూరంగా వీధుల్లో ఉంటున్నారు. వీరిని గుర్తించిన మండల విద్యాశాఖాధికారి –2 రవూఫ్ స్థానిక ఉపాధాయులతో కలసి పరిశ్రమల వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను బడిలో చేర్పించేలా చర్యలు చేపట్టారు. బడిలో చేరిన పిల్లలకు ప్రభుత్వం ద్వారా అందించే విద్యా సామగ్రి కిట్‌ను అందివ్వడంతోపాటుగా యూనిఫాం కూడా ఇస్తామని తెలిపారు. ఆయన వెంట తిమ్మనగారిపాళెం పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

అవగాహనతో కుష్టు వ్యాధి నయం



అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు

కలువాయి: అవగాహన కలిగి ఉండి సకాలంలో తగిన చికిత్స తీసుకుంటే కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని వ్యాధి నియంత్రణ జిల్లా అధికారులు డాక్టర్ సురేంద్రబాబు, డాక్టర్ నరసింహులు, డాక్టర్ మోహన్‌రావు అన్నారు. కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం కుష్టు వ్యాధిపై విద్యార్థులకు వారు అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి సోకడంతో శరీరంలో కలిగే మార్పులపై వారికి అవగాహన కల్పించారు. అటువంటి మార్పులు ఎవరికైనా గమనిస్తే మెడికల్ సిబ్బందికి తెలియజేయాలని కోరారు. సకాలంలో తగిన చికిత్స తీసుకుని వ్యాధి నుంచి బయట పడేందుకు సహకరించాలని తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద గత 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తారీఖు వరకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను, విద్యార్థులను చైతన్యవంతం చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మహబూబ్‌బాషా, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం ప్రశాంతి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి జైకిషోర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి



హాజరైన విద్యార్థులు

సైదాపురం: వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.లోకనాథం పేర్కొన్నారు. మండల కేంద్రమైన సైదాపురంలోని గోగినేని సుబ్బానాయుడు ఉన్నత పాఠశాలలో గురువారం మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం ద్వారా హెల్మెట్ ధరించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ద్విచక్ర వాహనాలను నడిపే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోందని, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్నందున మరణాలు కూడా సంభవిస్తున్నాయన్నారు. భద్రత కోసం హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ డీఎస్ విజయ్‌కుమార్, లీగల్ అడ్వైజర్లు మహబూబ్ బాషా, కోటేశ్వరరావు, డీటీ అనురాధ, న్యాయవాదులు పాల్గొన్నారు.

వ్యక్తిగత రుణాలపై దృష్టి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ పీడీ ప్రభావతి

పెళ్లకూరు: జీవనోపాధిని మెరుగు పరుచుకోవడం కోసం పొదుపు మహిళలకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ ప్రభావతి పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరులో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. పొదుపు మహిళలందరూ ఆర్థిక ప్రగతి సాధించుకొనేలా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. అలాగే బ్యాంకర్లు అలసత్వం లేకుండా సకాలంలో రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రికవరీ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్బారెడ్డి, ఏపీఎం విజయ్‌కుమార్, మునిరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న డీపీఎం భానుప్రసాద్

రాపూరు: అన్ని గ్రామాల్లో గ్రామీణాభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ డీపీఎం భానుప్రసాద్ పేర్కొన్నారు. రాపూరు మండల సమాఖ్య కార్యాలయాన్ని గురువారం సందర్శించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో గ్రామీణావృద్ధి ప్రణాళికలను తయారు చేసి గ్రామ సభలో ఆమోదం పొందాలన్నారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు తదితర అవసరాలను గుర్తించి మండల అధికారులకు నివేదిక అందించాలని సూచించారు. ఆయన వెంట ఫైనాన్స్ డీపీఎం రవికుమార్, ఏపీఎం మాధవి, వీఓలు, సీసీలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రోటరీ క్లబ్ గవర్నర్, నూతన ప్రెసిడెంట్, సభ్యులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. వాసవీ కల్యాణ మండపంలో గురువారం రాత్రి రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ సీఏ సాధు గోపాలకృష్ణ సారథ్యంలో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని చేపట్టారు. నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా పారిశ్రామిక వేత్త పెసల జయరాజగోపాల్ ఎన్నుకున్నారు. సెక్రటరీగా ఎస్.రామ్మోహన్, వైస్ ప్రెసిడెంట్‌లుగా బి.సుబ్రహ్మణ్యం, డి.ప్రభాకర్ నాయుడు, జాయింట్ సెక్రటరీగా మునగాల కృష్ణారావు, ట్రెజరర్‌గా యచ్చా లక్ష్మీనారాయణరావు, రోటరీ ఫౌండేషన్ విభాగానికి ఆదవరం నాగూరయ్య, క్లబ్ చీఫ్ అడ్వయిజర్, చార్టెడ్ ప్రెసిడెంట్ కళత్తూరు జనార్దన్‌రెడ్డి, మహిళ రోటేరియన్‌గా పి.కుసుమకుమారి, వివిధ విభాగాలకు సభ్యులను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఎన్నికతోపాటు ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రోటరీ క్లబ్ కోస్టల్ జోన్ అసిస్టెంట్ గవర్నర్ యు.వాసు గౌడ్, బి.సురేందర్ రెడ్డి, కె.ముని గిరిష్, వి.సతీష్ బాబు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ



డ్రోన్ ట్యాంకులో పురుగు మందు నింపుతున్న రైతులు

దొరవారిసత్రం: తల్లంపాడు గ్రామ పరిధిలో వరి పొలాలపై గురువారం వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేశారు. సూళ్లూరుపేట సబ్ డివిజన్ ఏడీఏ అనిత మాట్లాడుతూ డ్రోన్ పిచికారీతో పంటకు సమాన మోతాదులో పురుగు మందు అందుతుందన్నారు. ఐదు నిమిషాల్లో ఎకరా పంటకు ఈ పద్ధతిలో పిచికారీ చేయవచ్చన్నారు. కూలీల కొరత ఉన్న సమయంలో ఈ డ్రోన్ ఎంతగానో రైతులకు ఉపయోగ పడుతుందని తెలియజేశారు. గత ఏడాది డ్రోన్ పైలట్‌గా శిక్షణ తీసుకుని లైసెన్స్ పొందిన కోట మండలం గూడలి గ్రామానికి చెందిన ఎ.చాముండేశ్వరెడ్డి(9440423487) డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేస్తారన్నారు. ఎకరాకు రూ.350 మాత్రమే తీసుకుంటారని వివరించారు. అదే విధంగా గ్రామాల్లోని కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలన్నారు. 50శాతం రాయితీతో జీలగలు ఆయా ప్రాంతాల్లోని వీఏఏ వద్దకు పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ జ్యోతిర్మయి, కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

అవకతవకలు బయట పెట్టాలి



ఉపాధి గ్రామ సభలో మాట్లాడుతున్న సీఆర్‌పీ రవి

చిల్లకూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏడాదికోసారి చేపట్టే సామాజిక తనిఖీలలో అవకతవకలను బయటపెట్టాలని సీఆర్‌పీ రవి సూచించారు. మండలంలోని చింతవరం గ్రామంలో గురువారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీలో భాగంగా గ్రామ సభను నిర్వహించారు. పనులు జరిగిన చోట గుర్తించిన అవకతవకల వివరాలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. క్షేత్ర సహాయకులు అవకతవకలు పాల్పడినట్లు గుర్తించి ఉంటే వాటిని బయట పెట్టేందుకు ఇలా గ్రామ సభలు ఎంతగానో ఉపయోపడుతాయని ఆయన తెలిపారు. గ్రామ సర్పంచ్ జోగి సుగుణమ్మ, ఉపాధి ఏపీఓ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తెల్ల తెగులుతో అప్రమత్తంగా ఉండాలి

చిల్లకూరు: వరిలో తెల్ల తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి గూడూరు భవాని సూచించారు. మండలంలో ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరిని పలు ప్రాంతాలలో గురువారం పరిశీలించారు. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా అక్కడక్కడా తెల్ల తెగులు సోకి ఉండి ఆకులు పాడి బారి పోయినట్లు గుర్తించారు. దీంతో రైతులకు పలు సూచనలు ఇచ్చారు. తెల్ల తెగులు సోకిన వరిని అలాగే వదిలేస్తే ధాన్యం కంకులు కూడా నాశనమై పోయి పంట నష్ట పోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. దీనిని నివారించేందుకు ప్రతి రైతు ఒక ఎకరాకు క్లోరాంట్రీనిప్రోల్ 60 ఎంఎల్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలని అన్నారు. అలా కాక పోతే ఫ్లూటిండామైడ్ అనే ద్రావణాన్ని 20 ఎంఎల్‌ను నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు నత్రజని ఎరువులను మోతాదుకు మించి వాడితే ఇలాంటి ఫలితాలే ఉంటాయని తెలిపారు. అనంతరం చిల్లకూరులో వ్యవసాయశాఖ కార్యాలయంలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను అందజేశారు. కౌలు చేసుకునే రైతులు సంబంధిత భూ యజమాని వద్ద లీజు అగ్రిమెంటు తీసుకుని వస్తే వారి పేరుతో కౌలు కార్డులు అందిస్తామని దాని ద్వారా పంట నష్టం పరిహారంతోపాటుగా రైతు సాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఆమె వెంట వ్యవసాయశాఖ సహాయకులు చెంచుక్రిష్ణయ్య, సరిత తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణంకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దాత

గూడూరు రూరల్: పట్టణంలోని కాశీ లే అవుట్‌లో ఉన్న అయ్యప్ప ఆలయం నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించారు. గత కొన్నేళ్లుగా ఆలయ నిర్మాణం చేపట్టినప్పటికీ పూర్తి కాకపోవడంతో ఇటీవల ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు భిక్షాటన ద్వారా నిధుల సేకరణకు పూనుకున్నారు. ఈ క్రమంలో గురువారం గూడూరు పట్టణానికి చెందిన కె.విజయశేఖర్ తన కుటుంబ సభ్యుల సహకారంతో రూ.1,00,116 ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు నందవరం సుబ్బారావు మాట్లాడుతూ శ్రీధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణానికి దాతలు తమ వంతుగా ముందుకు వచ్చి నిధులు అందిస్తున్నారని అన్నారు. త్వరలోనే అయ్యప్ప ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ట చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు.

29 నుంచి ఆడికృత్తిక ఉత్సవాలు



వల్లీ దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణేశ్వర స్వామివారు

నాయుడుపేట టౌన్: బ్రాహ్మణవీధిలో ఉన్న వల్లీదేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 29వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఆడి కృత్తిక ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ తెలిపారు. గురువారం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించి వివరాలను వెల్లడించారు. 29వ తేదీ నాడు అమ్మవారి స్వరూపమైన శ్రీచక్ర మహామేరువుతోపాటు 108 వేలాయుధాలకు ప్రత్యేక అభిషేక పూజలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 30 ఆడికృత్తిక రోజున 108 వేలాయుధాలతో నగరోత్సవం, అనంతరం స్వామివారి కల్యాణోత్సవం, సుబ్రహ్మణ్య మూలమంత్ర పూజలను నిర్వహిస్తామన్నారు. 31న ఏకాంతసేవ పూజలతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు దాతలు సహకరిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వెల్లడించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



సేంద్రియ ఎరువులపై వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

బాలాయపల్లి(సైదాపురం): రైతులు పంటల సాగులో ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య పేర్కొన్నారు. బాలాయపల్లి మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో ఆత్మ సహకారంతో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా పంటల సాగుకు రసాయనిక ఎరువులు వినియోగించడంతో భూమి సారాన్ని కోల్పోతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయాలని, దీంతో నాణ్యమైన పంట దిగుబడి వస్తుందన్నారు. పంట పొలాలు కూడా సారవంతంగా ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ వేణుగోపాలరావు, మండల వ్యవసాయశాఖ అధికారి శిరీష, వ్యవసాయ సహాయకుడు సలీం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులు

వాకాడు: నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులని ఉమ్మడి నెల్లూరు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ టి.సోమయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో నిర్వహించిన జాతీయ కృత్రిమ గర్భధారణ, లేగ దూడల ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమయ్య మాట్లాడుతూ మండలంలోని 52 మంది పాడి రైతులు వివిధ జాతులకు చెందిన లేగ దూడలను ప్రదర్శనలో ఉంచారన్నారు. వాటి పోషణలో తీసుకోవాల్సిన మెళకువలు, పెయ్యి దూడల ఉత్పత్తి, పిండ మార్పిడిపై పాడి రైతులకు అవగాహన కల్పించామన్నారు. అనంతరం లేగ దూడలకు నులి పురుగుల మందు తాగించి, రైతులకు ఉచితంగా మందులు, కాల్షియం టానిక్ అందజేశామన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న లేగ దూడల రైతులకు బహుమతులు అందజేశామన్నారు. అలాగే వివిధ జాతుల లేగ దూడల పోషణలో మంచి ఫలితాలు సాధించిన ఉమ్మడి పుల్లయ్య, ఆవుల వెంకటకృష్ణయ్య, గుజ్జలపూడి మురళి అనే రైతులను అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందించామన్నారు. వాకాడు పశువైద్యశాల ఏడీ రమణయ్య, వైద్యుడు శివరామకృష్ణ, రైతు గోపీనాయుడు, పలు పార్టీలకు చెందిన నాయకులు ఏనుగు సుధాకర్‌నాయుడు, డి.మధురెడ్డి, వేణునాయుడు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



డాక్టర్ నూరిపారిని సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

సూళ్లూరుపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేసీఐ సంస్థ, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ వారు సంయుక్తంగా గురువారం హెల్త్ అండ్ హైజిన్, టైం మేనేజ్‌మెంట్ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కడపలో పది రూపాయల డాక్టర్‌గా పేరుపొందిన డాక్టర్ నూరిపారి పైన తెలిపిన రెండు అంశాలపై పలు ఉదాహరణలతో విద్యార్థులకు సూచనలు చేశారు. విద్యార్థులు ముందుగా సమయ పాలన పాటించి క్రమశిక్షణను అలవాటు చేసుకుంటే అది జీవితాన్ని నిలబెడుతుందని వివరించారు. అదే విధంగా నేటి ప్రపంచం జంక్ ఫుడ్‌కి అలవాటు పడి అనారోగ్యాలకు గురవుతున్నారని వాపోయారు. అనంతరం ఆమెను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. జేసీఐ అధ్యక్షులు సాయిశరత్, జేకేసీ కో-ఆర్డినేటర్ సీహెచ్. సుబ్రమణ్యంశాస్త్రి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ పీ.విక్టోరియారాణి పాల్గొన్నారు.